
# సెల్ఫిష్

డా॥ యం. హరికిషన్



"నెంబరెంత"

"254810"

"ల్యాండ్‌లైన్ కాదువై... సెల్‌నెంబరెంత"

"లేదురా"

"ఏందీ... సెల్లేదా!!!!

బండి మీద పోతున్నోడు సైకిల్మీద పోతున్నోన్ని చూసినట్టు ఒక్క చూపు చూశాడు.


సుబ్బారావు సిగ్గుతో బిక్కచచ్చిపోయాడు. వాని చూపుకు పరుగెత్తుకెళ్లి ఏ సైకిల్ కిందన్నా పడి ఆత్మహత్య చేసుకోవాలన్నంత కోరిక కల్గింది.

"చూడు సుబ్బారావ్.. ఇంకా ఏ కాలంలో వున్నావ్ నీవు. ఈ ఆధునిక ప్రపంచంలో ఒక చోటునుండి మరొక చోటుకి చిరుతపులుల్లా అత్యంత వేగంగా కదిలే మనకు సెల్‌ఫోన్ ఒక వరం. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ సమయంలోనైనా మన వెనకాలే వచ్చే అందమైన మేలుజాతి బుజ్జి కుక్కలాంటిది సెల్లంటే. సెల్ మన జేబులో వుంటే ఎంత ధైర్యం. ఎంత స్టైల్. ఎంత హోదా... సెల్లు కూతలు కూసేటోనికున్న విలువ ల్యాండ్‌లైన్ అరుపులు అరిసేటోని కెక్కడిది. తొందరగా ఓ మంచి పీసు కొనేసెయ్. ఇల్లు లేకపోయినా నష్టం లేదుగాని సెల్లు లేకపోతే కష్టం'' అంటూ స్పీచిచ్చి బుజ్జి గాడు వెళ్లిపోయాడు.

సుబ్బారావు ఆలోచిస్తూ నడవసాగాడు. బుజ్జి గాడు చెప్పిన మాటలు పదేపదే గుర్తుకు రాసాగాయి. అంతలో బండిమీదొకడు చెవికీ, భుజానికీ మధ్య సెల్లిరికించుకుని మెడ తెగిన మేకలాగా వస్తూ కనబన్నాడు. ఎందుకైనా మంచిదని సుబ్బారావు గబగబా ఫుట్‌పాతెక్కేశాడు.

ఆ రోజు నుండి సుబ్బారావుకు రోడ్ల మీద, సినిమా టాకీసుల్లో, ఆఫీసుల్లో, రైళ్లలో, బస్సుల్లో, హోటళ్లలో ఎక్కడ చూసినా సెల్బాబులు, సెల్పాపలు, సెల్లంకుళ్లు, సెల్లాంటీలు, సెల్ఫ్రెండ్లే కనబడసాగారు. పదిమంది మధ్య మాట్లాడుతున్నప్పుడు సెల్లరిస్తే వాళ్ళు ఏమాత్రం ఇబ్బందిగా ఫీల్‌కాక గర్వంగా స్టైల్‌గా చెవిపక్కన పెట్టుకొని 'హలో' అనేటప్పుడు వాళ్ల కళ్లు మీ అందరికన్నా నేను గొప్పసుమా అని గర్వంగా మెరిసిపోవడం గమనించాడు.

సుబ్బారావుకు వాళ్ల కొలీగ్ మురళీకృష్ణ గుర్తుకొచ్చాడు. మురళీకృష్ణ రిచ్చు కాదు గానీ రిచ్చుకు రీచ్‌గానే వుంటాడు. కాళ్లకు బూట్లు, నడుముకు బెల్టు, కళ్లకు గ్లాసు, జేబుకు సెల్లు ఎప్పుడూ వుంటాయి.




ఆఫీసులో పనిచేస్తున్నప్పుడు వానికెప్పుడూ ఎవడూ ఫోన్చేయడు. కానీ ఏవైనా మీటింగ్లు జరుగుతున్నప్పుడు మాత్రం కనీసం గంటకోసారైనా సెల్లరుస్తాది. అందరూ వానివంకే చూస్తారు. వాడు స్టైల్లుస్టైల్లుగా, గర్వం గర్వంగా బైటకుపోయి మాట్లాడిచ్చేస్తాడు. ఇదేదబ్బా ఎప్పుడూ రాని పిలుపులు ఇట్లాంటప్పుడే వస్తాయని తీగపట్టుకుని లాగితే డొంకంతా కదిలింది. వాడా రోజు ఫోన్చేయమని ముందే పెండ్లానికి చెప్పొచ్చేస్తాడు. మొగునాజ్ఞ శిరసావహించే వాని ముద్దుల పెండ్లాం ముచ్చటగా మూడుసార్లన్నా, మూడొచ్చినా రాకపోయినా ముద్దుముద్దుగా ఫోన్చేస్తాది. అందరి మధ్యా సెల్మోహంలో పొందే ఆనందం అట్లాంటింది.

సుబ్బారావుకు 'సెల్ కొనాలా! వద్దా!' అనే వూగిసలాట ఎక్కువైంది. సెల్మహిమ అర్థమవుతున్నకొద్దీ దాన్ని కొనాలన్న కోరిక బలంగా కలగసాగింది. కానీ అదే సమయంలో 'మధ్య తరగతోనికంత అవసరమా!' అని మరోపక్క మనసు పీకసాగింది. లాభనష్టాల లెక్కలు బేరీజు వేసుకోవడం మొదలుపెట్టాడు. ఎందుకైనా మంచిదనీ అనుక్షణం చాయ్కీ, కాఫీకి లెక్కలేసుకునే గోవిందాన్ని హోటల్కి తీస్కపోయి కాఫీ తాపుతూ సలహా అడిగాడు.

గోవిందం ఫ్రీగా వచ్చిన కాఫీని ఆనందంగా చప్పరిస్తూ "చూడు సుబ్బారావ్... సెల్ మైన్టైన్ చేయడమంటే ఇంజనీరింగ్ కాలేజీ పెట్టినంత ఈజీ గాదు. మొదట నువ్వు ల్యాండా, సెల్లా ఏదో ఒకటి నిర్ణయించుకో. సెల్లే అనుకుంటే ల్యాండ్లైన్కి నూకలు సెల్లించేయ్. సెల్లుందిగదా అని ఒకటే సొల్లు కూతలు కూసుకుంటా వున్నావనుకో తడిసి మోపెడంత, ఎక్కువ పోస్తే లారీ అంత అవుతాది. చూస్కోని చూస్కోని వాడాల. సెల్లునుండి సెల్లుకు సేయాలగానీ పొరపాట్న గూడా ల్యాండ్కు సేయగూడదు. ల్యాండ్లైనుకు సేయాలంటే ఎక్కుడన్నా డబ్బా ఫోనుంటే రూపాయేసి మాట్లాడాల. టెలిగ్రాంలా మాటలు పొదుపుగా వాడాల. మాటలనవసరం అనుకున్నప్పుడు మెసేజ్ ఇవ్వాల. పొరపాట్న గూడా ఫ్రెండ్స్ కివ్వగూడదు. ఒక్కసారిచ్చావో మళ్లీ మళ్లీ అడుగుతారు. ఏ ఏ కంపెనీలు ఏ ఏ ఆఫర్లిస్తున్నాయో జాగ్రత్తగా గమనించాలి. కార్డయిపోయినా ఇన్కమింగ్ ఏ కంపెనీ ఎక్కువ రోజులు ఇస్తుందో చూసుకోవాలి.

ఎవర్నైనా ఎక్కడికైనా రమ్మన్నప్పుడు సమయానికి వాడు రాకపోతే నువ్వు వచ్చినట్టు రింగివ్వాల. మాట్లాడాల్సిన అవసరం లేదు. అప్పుడప్పుడు మాట్లాడాల్సినోనికి రింగిచ్చి వాడెత్తేలోగా ఆఫ్ చేయ్యాల. తరువాత వాడే ఫోన్చేస్తాడు. కొంతమంది మనలాంటోళ్లే అవతలవైపు గూడా వుంటారు. వాళ్లు మనం రింగిస్తే వాళ్లు కూడా రింగిచ్చి రింగు రింగు సెల్లు అని గమ్మునుంటారు. అట్లాంటప్పుడు అధైర్యపడగూడదు. ఎంత చిన్న సెల్లుంటే అంత గొప్ప. కానీ కొత్తవి కొనకు. ఇప్పుడు పీసులు మంచి మంచివి గూడా తక్కువ రేటుకే సెకండ్ హ్యాండ్వి దొరుకుతున్నాయ్. తొందరపడి డబ్బు తగలెయ్యకు" అంటూ ఆపి "చిల్లరుంటే ఇయ్యి. సిగరెట్ తెచ్చుకుంటా, చేంజ్ లేదు" అన్నాడు. సుబ్బారావు లోపల్లోపల గొణుక్కుంటూ చిల్లరిచ్చాడు.

గోవిందం సిగరెట్టంటించుకొని దమ్ములాగుతూ "కానీ.. ఈ సెల్లుతో లాభాల్తో బాటు కొన్ని నష్టాలు గూడా వున్నాయి బాస్. మనం ఎక్కడున్నా మనం పెండ్లాం బిడ్డలకి వెంటనే దొరికిపోతాం. ఆలస్యమైతే రింగు మీద రింగిచ్చి ఇంటికొచ్చేంతవరకు సతాయిస్తారు. మా ఫ్రెండ్ వెంకటేశ్వర్లని ఒక చిల్లర నాయకుడున్నాడ్లే. పొద్దున లేసినప్పటి నుండి అర్ధరాత్రి వరకు ఆడా ఈడా గప్పాలు కొట్టుకుంటా తిరుగుతుంటాడు. పాపం వాని పెండ్లానికి మొగుడు ఇంటికెప్పుడొస్తాడో తెలీదు. ఎప్పుడు పోతాడో తెలీదు. అర్ధరాత్రి మీద టక్కున చేయిపడ్తే అమెరికా సైనికుడేమోనన్నంత అదిరిపడి చూస్తే ఇంగేముంది ఎర్రినవ్వులు నవ్వుతా మొగుడు కనబడేటోడు. యాడికిపోతాడో, ఎప్పుడొస్తాడో, ఒక్కోసారి ఎన్ని రోజులకొస్తాడో గూడా తెలీదు. ఆఖరికి ఆమె లాభం లేదనుకొని తాళిమ్మి ఓ సెల్లు కొనుక్కొనొచ్చి మొగుని మెళ్లో వేసింది. ఆరోజు నుండి కాస్త ఆలస్యమైతే చాలు "ఇంగరారా ఇంటికని" సెల్లు ఒకటే అరుస్తా వుంటాది. పాపం ఇప్పుడు ఎంత పనున్నా మట్టసంగా ఇంటికి పోతావున్నాడు" అని చెప్పి నవ్వేశాడు.

సుబ్బారావుకి సెల్సంగతులన్నీ బాగా వంటబట్టేశాయి. సెల్ కొనేయాలనే వుబలాటం వురకలు వేయసాగింది. పెండ్లానితో ఎలా చెప్పాలబ్బా అని ఆలోచించసాగాడు. సుబ్బారావు పెండ్లాం లక్ష్మీదేవి ఆవులిస్తే పేగులు లెక్కబెట్టేరకం. ఏదీ రకీమని అంత తొందరగా ఒప్పుకోదు. ప్రతిదీ ఆలోచించీ... చించీ.. ఆచితూచి మాట్లాడ్తాది. ఆమెతో మాట్లాడ్డం చానా కష్టం. పెండ్లాన్నెలా ఒప్పించాలబ్బా అని ఆలోచిస్తా ఇంటికి చేరుకున్నాడు.

కాళ్లు చేతులూ కడుక్కొని పెండ్లామిచ్చిన కాఫీ తాగుతూ నెమ్మదిగా సెల్ కొనాలనుకున్న విషయాన్ని చెప్పాడు.

ఆమె కాఫీ గ్లాసు కడిగి గూట్లో పెడుతూ "అంత వసరమా" అనింది.

సుబ్బారావు నసుగుతా "అదీ... అదీ... మనిద్దరం పొద్దున్నే వుద్యోగాలకెళ్లిపోతాం గదా... ఎవరికైనా ఏదైనా అర్జంటవసరం పడ్తే అందుబాటులో వుంటాం గదా.... అందుకని" అన్నాడు.

లక్ష్మీదేవి కాసేపాలోచించి "అలాగే ... సరేగాని.. ఇంతకూ ఈ ల్యాండ్ లైన్ ఏం చేద్దాం" అడిగింది.

వెంటనే సుబ్బారావు "ఇకెందుకు. దండగది... వాపసిచ్చేసి డిపాజిట్ తెచ్చేస్తా... దాంతోనే ఓ మ్యాంచి పీసొస్తాది" అన్నాడు.

"మీ మగాళ్లు సెల్ఫిష్లని తెల్సుగానీ... మరి నా సంగతేంటి. నా కెవరన్నా ఫోన్చేయాలంటే ఎట్లా" ప్రశ్నించింది.

"సెల్లుంది గదా" రకీమని సమాధానమిచ్చాడు.

"ఎవరికి మీకా... నాకా" సూటిగా అడిగింది.

"నీకూ... నాకు.. ఏందే... మనిద్దరికీ"

"అలాగా... ఐతే కొనండి. కానీ నా దగ్గర పెట్టుకుంటాను. సరేనా" అనడిగింది.

సుబ్బారావుకు ఒక్కసారిగా గొంతులో పచ్చివెలక్కాయ పన్నట్లయింది.

"నీ దగరుంటే ఎట్లానే... మరి నాకు" అన్నాడు.

లక్ష్మీదేవి మొగునే్న సూటిగా చూస్తూ "చూడు ల్యాండ్లైన్ ఇద్దరిదీ... కానీ ఇల్లు పర్సనల్. మన మధ్యతరగతి ఫామిలీల్లో మీ మగాళ్లు ఇంట్లో ల్యాండ్ లైన్నాడబెరికి, సెల్లు జేబులో ఏసుకొని దర్జాగా బైట తిరుగుతుంటారు. మేమేమో ఎవరికన్నా ఫోన్చేయాలంటే రోడ్లమీద పడాల. బైటికి పోలేనోళ్లు మొగున్నడిగి ఆజ్ఞ తీసుకొని మాట్లాడాల. మాకెవరన్నా ఫోన్చేసినా ముందు మీరెత్తి మాకిస్తారు. మీ ముందే, మీరున్నప్పుడే మాట్లాడాల. ఎవరితో మాట్లాడుతున్నాం. ఎంతసేపు మాట్లాడుతున్నాం అన్నీ మీ అధీనంలోకి వచ్చేస్తాయి. వ్యక్తిగతం బంద్. మాటలు సెన్సార్. నాకిట్లాంటివి నచ్చవ్. నీకెంత సంపాదనుందో నాకూ అంతే వుంది. కాబట్టి కొంటే ఇద్దరికీ సెల్లు కొను. లేదా మట్టసంగుండు" అనింది.

అంతే... సుబ్బారావు ఇంకేమీ మాట్లాడలేక, రెండు సెల్లులు కొనే ధైర్యం లేక గమ్మున నోర్మూసుకున్నాడు.

★